RNI No. APTEL/2010/ 36692 AKSHARA PRAKASAM aksharaprakasam@gmaiil.com

అక్షర ప్రకాశం

Published From Prakasam People News Paper

సంపుటి : 15 సంచిక : 316 అక్టోబర్ 6 మంగళవారం 2026 ప్రకాశం పేజీలు : 4 వెల - 2

ఇంటింటికీ జలధార...

రూ.30,156 కోట్లతో బృహత్ పథకం ప్రారంభించిన చంద్రబాబు, పవన్

- ప్రొద్దుటూరులో 'అమరజీవి జలధార' పనులకు శ్రీకారం
- రూ.30,156 కోట్లతో 27 లక్షల కుటుంబాలకు సురక్షిత తాగునీరు
- రాయలసీమ రైజింగ్‌ను ఎవరూ అడ్డుకోలేరన్న చంద్రబాబు
- గోదావరి పుష్కరాల లోపు పోలవరం పూర్తి చేస్తామని హామీ
- గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- గొడ్డలి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న సీఎం

అక్టోబర్ 5 : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జల్ జీవన్ మిషన్ 2.0లో భాగంగా రూ.30,156 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన 'అమరజీవి జలధార' పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం ప్రారంభించారు. కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కొత్తపల్లిలో వారు పైలాన్‌ను ఆవిష్కరించి ఈ బృహత్ పథకానికి అంకురార్పణ చేశారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మరో 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు అందించనున్నారు. ఇందుకోసం 13,075 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, 77,243 కిలోమీటర్ల పైపులైన్ల విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే రాష్ట్రంలో మొత్తం 3.3 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇప్పటికే 62 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు ఉండగా, ఈ కొత్త పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఈ సందర్భంగా ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. రాయలసీమకు 'రప్పారప్పా' రాజకీయం కాదని, అభివృద్ధి, సంక్షేమం కావాలని స్పష్టం చేశారు. రాయలసీమ అభివృద్ధి బుల్లెట్‌లా దూసుకెళ్తుందని, దానిని ఎవరూ ఆపలేరని అన్నారు. రూ.1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేసి సీమ దశ, దిశ మారుస్తామని ప్రకటించారు. భవిష్యత్తులో శత్రు దేశాలను చీల్చిచెండాడే ఫైటర్ జెట్లు 'మేడ్ ఇన్ రాయలసీమ' అని చెప్పుకునే రోజులు వస్తాయని, ఇక్కడ పండే ఫలాలు 'రాయలసీమ బ్రాండ్'తో ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. రానున్న గోదావరి పుష్కరాల లోపే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు.

గొడ్డలి పార్టీపై తీవ్ర విమర్శలు

గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు గొడ్డలి పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. వివేకా హత్య కేసు నుంచి మద్యం కుంభకోణం వరకు అన్ని వేళ్లూ ఆ పార్టీ అధినేత వైపే చూపిస్తున్నాయని ఆరోపించారు. కుట్రలు, ఫేక్ ప్రచారమే ఆ పార్టీ సిద్ధాంతమని, వారి డీఎన్ఏలోనే నేరాలు చేసి ఇతరులపై నెట్టేయడం ఉందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష హోదా కోరడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ కూటమి అధికారంలో ఉంటే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్'తో అభివృద్ధి వేగవంతం అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.సవిత, పి.నారాయణ, బీసీ జనార్ధన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆ పోస్టులను భర్తీ చేస్తాం..

మంత్రి గొట్టిపాటి కీలక ప్రకటన

విశాఖపట్నం, అక్టోబర్ 5 : గడిచిన మూడేళ్లుగా త్వరితగతిన కారుణ్య నియామకాలు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత విద్యుత్ శాఖలో 445 మందికి పైగా కారుణ్య నియామకాలు చేపట్టా మని పేర్కొన్నారు. విశాఖపట్నంలోని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఈరోజు (సోమవారం) ఉద్యోగులకు కారు ణ్య నియామక పత్రాలను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీ తేజ్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు. 43 మంది ఉద్యోగులకు కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. అనం తరం ఈపీడీసీఎల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడారు.

విద్యుత్ శాఖపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి..

సచివాలయాల్లో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ శాఖలోకి తీసుకున్నామని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. సీఎం చంద్రబాబుకు విద్యుత్ శాఖపై ప్రత్యేక దృష్టి ఉందని చెప్పుకొచ్చారు. త్వరలో గ్రౌండ్ లెవెల్‌లో ఉన్న లైన్‌మన్ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు. విద్యుత్ వినియోగంలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అండర్ గ్రౌండ్ కేబులింగ్ చేస్తున్నామని వివరించారు. భవిష్యత్తు విద్యుత్ శాఖలో సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ మూడేళ్లలో తమ ప్రభుత్వం కరెంట్ బిల్లు పెంచలేదని.. విద్యుత్ బిల్లు పెంచకూడదని సీఎం చంద్రబాబు ఆదేశించారని అన్నారు. ఉద్యోగులు విధుల్లో జాగ్రత్త వహించాలని సూచించారు. విద్యుత్ శాఖలో ప్రమాదాలు జరగకుండా చూడాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిశానిర్దేశం చేశారు.

మార్కాపురంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి

- పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తేవాలి

- విద్యాశాఖ మంత్రి చొరవ చూపాలి: డాక్టర్ షేక్ మహబూబ్ వలి

మార్కాపురం, అక్షర ప్రకాశం : అక్టోబరు మార్కాపురం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి కోరారు. మార్కాపురం జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇక్కడ ప్రభుత్వ కళాశాలలు అందుబాటులోకి వస్తే పేద, మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాలు, మైనారిటీ కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. గతంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పశ్చిమ ప్రకాశంగా వెనుకబడిన ప్రాంతంగా ఉన్న మార్కాపురం పరిసర ప్రాంతాల్లో అనేక కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఉన్నత విద్యకు ప్రాధాన్యం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో స్థానికంగా ప్రభుత్వ విద్యాసంస్థలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మార్కాపురం పట్టణంలో ప్రైవేటు కళాశాలలు ఉన్నప్పటికీ అధిక ఫీజుల కారణంగా పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల అందుబాటులో లేకపోవడంతో మార్కాపురం పట్టణానికి చెందిన కొంతమంది విద్యార్థులు సమీపంలోని పెద్దారవీడు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి విద్యాభ్యాసం చేయాల్సి వస్తోందన్నారు. సాధారణంగా జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల మండలాల నుంచి విద్యార్థులు వచ్చి చదువుకోవాల్సి ఉండగా, మార్కాపురం జిల్లా కేంద్రంలోని విద్యార్థులే ఇతర మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండటం గమనించాల్సిన అంశమన్నారు. మార్కాపురంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేస్తే పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాల విద్యార్థులకు కూడా విద్యా అవకాశాలు మరింత చేరువవుతాయని తెలిపారు. ముఖ్యంగా పేద, బడుగు బలహీన వర్గాలు, మైనారిటీ విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కలుగుతుందని చెప్పారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి మార్కాపురం ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చొరవ తీసుకోవాలని, మార్కాపురం పట్టణంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు తగిన ఉత్తర్వులు జారీ చేయాలని డాక్టర్ షేక్ మహబూబ్ వలి కోరారు. ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటైతే మార్కాపురం ప్రాంతంలో విద్యా అవకాశాలు మరింత మెరుగుపడి, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

మంచానికే పరిమితమైన సన్యాసిరావుకు రూ.15 వేల పింఛను ఇవ్వాలి

వి. మాడుగుల, అక్షర ప్రకాశం : పక్షవాతంతో తీవ్ర అనారోగ్యానికి గురై రెండేళ్లుగా పూర్తిగా మంచానికే పరిమితమైన అద్దిపిల్లి సన్యాసిరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన భార్య, పిల్లలు కోరుతున్నారు. ప్రస్తుతం నెలకు రూ.6 వేల దివ్యాంగుల పింఛను అందుతున్నప్పటికీ, వైద్య ఖర్చులకు అది సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సన్యాసిరావు పరిస్థితిని వైద్యాధికారులు పరిశీలించి, బెడ్‌రిడెన్ బాధితులకు వర్తించే రూ.15 వేల పింఛను మంజూరు చేయాలని వారు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించి తమ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

35 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీకి రేపటినుండి రిజిస్ట్రేషన్ ప్రారంభం

రాచర్ల, అక్షర ప్రకాశం : రేపటినుండి అనగా తేదీ 6 -10-2026 నుండి రాచర్ల మండలంలోని అన్ని గ్రామాలలో 35 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీకి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి షేక్ మహబూబ్ బాషా ఒక ప్రకటనలో తెలపడం జరిగింది. రాచర్ల మండలానికి 1000 క్వింటాళ్ల జీG- 11 రకం మరియు 100 కింటాలు KAK-2 రకం మంజూరు అయ్యాయని రైతులు తమ రైతు సేవా కేంద్రాల వద్ద ఆధార్ కార్డు మరియు పాస్ బుక్ తీసుకొని వెళ్లి ముందస్తుగా విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. జీG-11 మరియు KAK -2 విత్తనాలు క్వింటా పూర్తి ఖరీదు 9000 సబ్సిడీ 35 శాతం పోను రైతు వాటా 5850/- చెల్లించి విత్తనాలు పొందాలని తెలిపారు. ఎకరానికి గరిష్టంగా 40 కేజీలు 5 ఎకరాల వరకు రైతులు పొందవచ్చు అని తెలిపారు.

శ్రీనాథు శ్రీనివాసరావుకు 'సేవారత్న' పురస్కారం సమాజ సేవకు దక్కిన విశిష్ట గుర్తింపు

- ఘనంగా సత్కరించిన ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్

వి మాడుగుల, అక్షర ప్రకాశం : సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తూ, విశిష్ట సేవలు అందిస్తున్న మాడుగులకు చెందిన ప్రముఖ వర్తకులు, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) అనకాపల్లి జిల్లా అధ్యక్షులు శ్రీనాథు శ్రీనివాసరావుకు అరుదైన గౌరవం దక్కింది. ఆయన సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఐవీఎఫ్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక 'సేవారత్న' పురస్కారాన్ని అందజేశారు. విజయవాడ గొల్లపూడిలోని ఆర్ కన్వెన్షన్‌లో ఆదివారం ఐవీఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కోన శ్రీనివాసరావు అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన 'సేవా పురస్కారాలు-2026' కార్యక్రమంలో భాగంగా శ్రీనాథు శ్రీనివాసరావును వేదికపై ఘనంగా సత్కరించారు. ఆయనకు శాలువా కప్పి, మెమెంటోతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ విజయవాడ అర్బన్ జిల్లా అధ్యక్షులు కొల్లూరు లక్ష్మణగుప్త, ప్రధాన కార్యదర్శి గొంట్ల రామమోహనరావు, ఐవీఎఫ్ కోఆర్డినేటర్ పల్లపోతు వెంకటేశ్వరరావుతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన పలువురు ప్రముఖులు, ఐవీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ప్రచార రథాన్ని ప్రారంభించిన అనపర్తి ఎమ్మెల్యే

రంగంపేట, అక్షర ప్రకాశం : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర ప్రజానీకానికి అందజేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకు వెళ్లేందుకు గాను రూపొందించిన ప్రత్యేక ప్రచార రథాన్ని సోమవారం అనపర్తి నియోజకవర్గం శాసన సభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు పథకాలపై అవగాహన కల్పించడమే కాకుండా, ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ఫలాలు అందించడానికి కృషి చేస్తున్నట్టుగా ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ఈ యొక్క ప్రచార రథం పర్యటన చేయనున్నట్లుగా ఆయన తెలిపారు.

అక్షర ప్రకాశం

మంగళవారం 6 - 10 - 2026

ఉప్పుటూరులో ప్రపంచ మెనింజైటిస్ దినోత్సవం

పర్చూరు, అక్షర ప్రకాశం : ప్రపంచ మెనింజైటిస్ దినోత్సవం సందర్భంగా ఉప్పుటూరు పంచాయతీ కార్యాలయం వద్ద ప్రభుత్వ హోమియో వైద్యాధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ మెనింజైటిస్ అనేది మెదడు మరియు వెన్నుపామును కప్పి ఉండే రక్షిత పొరల వాపు వ్యాధి అని, ఇది బ్యాక్టీరియా, వైరస్ల ఇన్ఫెక్షన్ కారణంగా సోకుతుందని, తీవ్రమైన తలనొప్పి, గందరగోళం, వెలుతురు చూడలేకపోవడం, వాంతులు, తీవ్రమైన జ్వరంతో పాటు మెడ బిగించుకొని పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే మెనింజైటిస్ అయ్యే అవకాశం ఉందని, వెంటనే వైద్యుని సంప్రదించాలని, వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా మెనింజైటిస్ను అరికట్టవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకురాలు కే నాగరాజా, వైద్యశాలకు వచ్చిన రోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన చిన్ని సేవా సంస్థ అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్

రాచర్ల, అక్షర ప్రకాశం : నాకు చదువు చెప్పిన గురువులందరికీ, నా ఎదుగుదలకు కారణమైన ప్రతి ఉపాధ్యాయునికి ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ సందర్భంగా చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ మాట్లాడుతూ.. "అక్షరాలు దిద్దించి, జ్ఞానాన్ని పంచి, నన్ను ఈ స్థాయికి తీర్చిదిద్దిన మీ రుణం ఎప్పటికీ మరువలేనిది. ఉపాధ్యాయులు అంటే కేవలం పాఠాలు చెప్పేవారు కాదు, జీవితానికి దిశ చూపే దీపం. ఒక విద్యార్థిని ప్రయోజకుడిగా మార్చే నిజమైన శిల్పి ఉపాధ్యాయుడే. తల్లిదండ్రులు జన్మనిస్తే, గురువు జీవితాన్ని ఇస్తాడు. గురువు లేని విద్య లేదు. మీ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలనికోరుకుంటున్నాను. నన్ను చిన్నప్పటి నుండి ఒక లీడర్గా తీర్చిదిద్దిన మీ అందరి ఆశీస్సులతో నేను పుట్టిన గ్రామం చినగానిపల్లె గ్రామ అభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం జరిగింది. నేను చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి 100 పైగా అవార్డులు, గౌరవ డాక్టరేట్లి రావడం జరిగింది" అని తెలిపారు.

అకాల వర్షం పిడుగుపాటుకు గేదె మృతి

ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం, అక్షర ప్రకాశం : కామవరపుకోట మండలం గుంటుపల్లి గ్రామపంచాయతీ జీలకర్ర గూడెంలో పిడుగు పాటుకు 2 లక్షల రూపాయలు విలువ చేసే గేదె మృతి. సోమ వారం అకాల వర్షంతో పాటు పిడుగుపాటుకు జీలకర్ర గూడెంలో పాడి గేదె మృతి చెందింది. బాహుబలేంద్రుని మోహన్సింగ్కు చెందిన గేదె వద్ద పిడుగు పడడంతో సంఘటన స్థలంలోనే గేదె మృతి చెందింది. తాను గేదెలను మేపుకుంటూ పాడి మీదే జీవిస్తోన్న మోహన్ సింగ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తాజా మాజీ సర్పంచ్ ఘోరింక దానుతో పాటు టీడీపీ సీనియర్ నాయకులు కంఠమనేని అంజిమూర్తి సంఘటన స్థలానికి వెళ్లి రైతు మోహన్ సింగ్కు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అక్కడ నుంచే వీఆర్వోతో పాటు పశువైద్య శాఖ అధికారికి తెలియజేశారు.

ప్రతి గృహ వినియోగదారుడు సూర్య ఘర్ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

బాపట్ల, అక్షర ప్రకాశం : ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ప్రతి గృహ వినియోగదారుడు సద్వినియోగం చేసుకొని విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి సూచించారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకానికి సంబంధించిన ప్రచార వాల్ పోస్టర్, కరపత్రాలను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ప్రతి గృహ వినియోగదారుడు అందిపుచ్చుకొని ఆర్థికంగా లబ్ధి పొందాలని తెలిపారు. ఈ పథకాన్ని భారత ప్రధాని 2024 ఫిబ్రవరి 13న ప్రారంభించారని చెప్పారు.

గృహాలపై రూఫ్టాప్ సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసి విద్యుత్ అవసరాలను తీర్చడం ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. 2027 మార్చి నాటికి దేశవ్యాప్తంగా ఒక కోటి గృహాలకు రూఫ్టాప్ సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే దేశంలో 58 లక్షలకు పైగా గృహాలపై సోలార్ రూఫ్టాప్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ పథకం కింద బ్యాంకుల ద్వారా సులభంగా రుణ సౌకర్యం పొందవచ్చని తెలిపారు. సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు అయ్యే ఖర్చులో 60 శాతం వరకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ లభిస్తుందని చెప్పారు. సోలార్ ప్యానెళ్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ను గృహ అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్ను గ్రిడ్కు అందించడం ద్వారా ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి గృహ వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట, ఇన్చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, ఎస్ఈ ఏపీ సీపీడీసీఎల్ ఆంజనేయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విజయ దుర్గ పీఠంలో దేవి శరన్నవరాత్రుల పందిరి రాట ముహూర్తం

రాయవరం, అక్షర ప్రకాశం : వెదురుపాక విజయ దుర్గా పీఠం 55వ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు సోమవారం శాస్త్రోక్తం గా రావటం మూర్తం చేశారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వివి బాపిరాజు ఆధ్వర్యం లో వేద పండితులు చీమల కొండవీరావధాని, కె.శివల అర్చకత్వంలో గాడ్ కుమార్తె గాదె సత్య వెంకట కామేశ్వరి, భాస్కర నారాయణ దంపతులు విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక నిర్వహించారు. అనంతరం వినాయ క పూజ, పుణ్యాహవచనము, రక్షా బంధన, తదితర పూజాతికాలు నిర్వ హించి 8గంటల19 నిమిషాలకు రాట ముహూర్తం చేశారు. శరన్నవ రాత్రి ఉత్సవాల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో విజయ దుర్గ సేవా సమితి ప్రతినిధులు బి.రమణ, పెదపాటి శ్రీనివాసమూర్తి (రాంపండు) సత్య కనకదుర్గ, బుజ్జి, పి ఆర్ ఓ వాడ్రేవు వేణుగోపాల్ (బాబి) భక్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలన ఏపీకి స్వర్ణయుగం.. జగన్ పాలన చీకటి యుగం : ప్రత్తిపాటి

- అడుగడుగునా అభివృద్ధి.. అన్నివర్గాలు మెచ్చే సంక్షేమం.
- ప్రజాప్రభుత్వమంటే ఇలా ఉండాలని కూటమి ప్రభుత్వం చేతలతో నిరూపిస్తోంది
- చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ ల పట్టువదలని సంకల్పానికి మోదీ సహకారం తోడవడం.. రాష్ట్రానికి దేవుడిచ్చిన వరం. : ప్రత్తిపాటి

అక్షర ప్రకాశం : " కేవలం వాగ్దానాలకే పరిమితం కాకుండా.. ఆచరణాత్మక ధృక్పథం, ప్రజల ఆశలు, ఆకాంక్షల దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులేస్తోంది. సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగే సమర్థుడైన నాయకుడి పాలనలో ప్రజలకు ప్రతిరోజూ పండగేననే అభిప్రాయం రోజురోజుకీ బలపడుతోంది. ప్రజల మనసెరిగి పాలన చేసే నిజమైన ప్రజా ప్రభుత్వం ఇలా ఉండాలి.. ఉంటుందని కూటమి ప్రభుత్వం చేతలతో నిరూపిస్తోంది. కూటమి పాలన ఏపీకి స్వర్ణయుగమైతే..... జగన్ పాలన ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేని చీకటి యుగం. అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక వసతుల కల్పనకు కూటమి అధిక ప్రాధాన్యమిస్తుంటే.. అవినీతి, దుష్ప్రచారం, కుంభకోణాల మాటున వైసీపీ నీచ రాజకీయాలు చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ల అపూర్వ కలయిక.. పట్టువదలని సంకల్పం.. ప్రజలకు మేలు చేయాలన్న వారి తపనకు ప్రధాని మోదీ అందిస్తున్న సహాయ సహకారాలు..రాష్ట్రానికి దేవుడిచ్చిన వరాలు.

అభివృద్ధిని ప్రారంభించడమే కాకుండా. పనుల్ని ప్రాధాన్యతాక్రమంలో పూర్తిచేసే దిశగా ఆచరణాత్మకంగా కూటమి ప్రభుత్వం ఒక్కో అవాంతరాన్ని అధిగమిస్తూ ఉండటం శుభపరిణామం. మొన్న మదనపల్లెలో గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ కు అంకురారప్పణ... నిన్న బుర్రిపాలెంలో 3డీ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం... నేడు ప్రొద్దుటూరులో రూ.30వేల కోట్ల విలువైన జల్ జీవన్ మిషన్ పనుల ప్రారంభం.. ప్రతి కార్యక్రమం.. కూటమి ప్రభుత్వ ప్రగతి ప్రస్థానంలో గొప్ప మైలురాళ్లుగా నిలిచిపోనున్నాయి. మదనపల్లెలో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన హార్టీకల్చర్ హబ్.. రాయలసీమ ప్రాంత వ్యవసాయ రంగానికి మరింత ఊతమిస్తుందనే చెప్పాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రైతులకు అందే మార్కెటింగ్, ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజ్, ఎగుమతి అవకాశాలు వారి ఆర్థిక ఉన్నతికి ఎంతగానో ఉపకరిస్తాయి. రైతు పండించే ప్రతి ఉత్పత్తికి మంచి గిట్టుబాటు ధర లభించడంతో ఉద్యాన రైతులకు ఎనలేని లబ్ధి చేకూరుతుంది. పేదల సొంతింటి కల అనే మహా యజ్ఞాన్ని సఫలం చేయాలన్న కృత నిశ్చయంతో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, అందుకోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రానికి పరిచయం చేశారు. గతంలో మాదిరి ఇంటి నిర్మాణంలో ప్రజలు ఎదుర్కొనే అనేక కష్టాలకు ఈ కొత్త టెక్నాలజీ ముగింపు పలుకుతుంది. 3డీ టెక్నాలజీతో ఇప్పటికే దుబాయ్, చైనా దేశాలు తమ ప్రజలకోసం అద్భుతమైన నిర్మాణాలు చేపడుతున్నాయి. సాంప్రదాయ నిర్మాణానికి భిన్నంగా.. తక్కువఖర్చు, ఎక్కువ నాణ్యతతో నిర్మించే 3డీ ఇళ్లతో ప్రజల్లో పాలకులపై ఉన్న నమ్మకం, విశ్వాసం రెట్టింపు అవుతాయి. జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జలధార కింద ప్రతి ఇంటికి కుళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందిం చాలన్న లక్ష్యసాధనలో ఎన్డీయే ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోంది. జేజేఎమ్ కింద పల్నాడు జిల్లాలో వాటర్ గ్రిడ్ ఏర్పాటు కు రూ.1200 కోట్ల అంచనా వ్యయంతో పనుల అంచనాలు ఖరారు చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏపీ జల్ జీవన్ మిషన్ ప్రాజెక్ట్ పనులు ఊపందుకున్నాయి. దానిలో భాగంగా నేడు ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లు 30 వేలకోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టడం రాష్ట్రానికే గర్వకారణం." అని ప్రత్తిపాటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పల్లె పండుగ 3.0తో భారీగా రహదారి నిధులు

- పల్లె పండుగ 3.0తో కుక్కునూరు మండలానికి భారీగా రహదారి నిధులు
- తెలంగాణ నుండి విలీనమయ్యాక అభివృద్ధికి నోచుకోని గ్రామాలకు పూర్వ వైభవం
- ఎమ్మెల్యే చిర్రి చొరవతో మండలానికి రహదారులకు మహర్దశ.
- రూ.8.09 కోట్లతో 9 బీటీ రోడ్లు.. పి ఆర్ ఆర్ ప్లైన్ కింద మరో మూడు ప్రధాన రహదారులు
- హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కు ప్రత్యేక ధన్యవాదలు తెలిపిన జనసేన ఉపాధ్యక్షులు మంత్రి గోపాలకృష్ణ

ఏలూరు జిల్లా,, కుక్కునూరు,, అక్షర ప్రకాశం : పల్లె పండుగ 3.0, ఏపీ రూరల్ రోడ్ స్ట్రెంతెనింగ్ ప్రాజెక్ట్ ద్వారా కుక్కునూరు మండలంలో రహదారుల అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చొరవతో భారీగా నిధులు మంజూరయ్యాయి. మండలంలోని దాచారం, గొమ్ముగూడెం గ్రామపంచాయతీల పరిధిలో 9 బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.4.10 కోట్లు కేటాయించారు. అదేవిధంగా పి ఆర్ ఆర్ ప్లైన్ కింద మరో రూ. 4.8 కోట్లు వాటిలో కుక్కునూరు మండలంలో మూడు ప్రధాన రహదారుల అయిన గుంపెనపల్లి గ్రామం నుండి గణపవరం గ్రామం వరకు 2.28 లక్షలు, మద్దిగట్ల గ్రామం రహదారి కి 1.81 లక్షలు, మిట్టగూడెం గ్రామం రహదారికి 71 లక్షలు మొత్తంగా మండలంలో 8 కోట్ల 90 లక్షలు గ్రామీణ రహదారుల పునర్నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని గ్రామాలకు ఎమ్మెల్యే చిర్రి ప్రత్యేకంగా దృష్టి సారించి మండలానికి రహదారుల కోసం గణనీయమైన నిధులు కేటాయించడంతో ప్రజలు, రైతులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. రహదారుల అభివృద్ధితో గ్రామాలు, వ్యవసాయ క్షేత్రాలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు సౌకర్యం కలుగుతుందని జనసేన మండల ఉపాధ్యక్షులు మంత్రి గోపాలకృష్ణ తెలిపారు. కుక్కునూరు మండలంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న కూటమి ప్రభుత్వనికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఇందుకు సహకరిస్తున్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

Published by : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. , Printed by : Nannuri Subba Rao, Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Printed at : Vijaya Printers (offset Printing), Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Published from : Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Editor : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Cell : 9848997263, E.mail : aksharaprakasam@gmail.com,